క్లుప్తంగా

గొడుగులమ్మ జాతర

కోరుకొండ: జంభూపట్నం గ్రామ దేవత గొడుగులమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పూజలు కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా అమ్మవారి ఊరేగింపు జరిగింది. తిరిగి అమ్మవారిని ఆలయానికి చేర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఉల్లి చెల్లారావు, ఉల్లి పట్టాభి, తోరాటి సత్యప్రసాద్, అడపా సురేష్, నాగా శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ సప్తాహాలు ప్రారంభం



సంపరలో పూజలు చేస్తున్న హనుమంతాచార్యులు ఫణిశ్రీ దంపతులు

పెదపూడి: భక్తి శ్రద్ధలతో భక్తులు, గ్రామస్తులు శ్రీరామ సప్తాహాలను వైభవంగా నిర్వహించాలని తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు గంగాధర్‌భట్ల విష్ణశర్మ అన్నారు. సంపర గ్రామంలో 59వ శ్రీరామ సప్తాహాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. విష్ణశర్మ అధ్వర్యంలో 20 మంది పండితులు ఉదయం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పూజల్లో ప్రముఖ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, ఫణిశ్రీ దంపతులు యజ్ఞకర్తలుగా కూర్చున్నారు. వారు కలశస్థాపన చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన భక్త మండలి వారు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు

సీతానగరం: వీఆర్వోగా పని చేస్తున్న సీతానగరంకు చెందిన అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఈ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోషల్ మీడియా వేదికగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌లలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణంపై వ్యంగ్య పోస్టింగులు, కించ పర్చుతూ పెడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీతానగరంకు చెందిన వీఆర్వో అఖిల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

పేదలకు సాయం కోసమే రంజాన్



మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

బిక్కవోలు: ముస్లింలకు పండగలలో ముఖ్యమైనవి రంజాన్. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రంజాన్ మాసంలోనే అవతరించింది. పేద, ధనిక బేధం లేకుండా ప్రతి ముస్లిం సంతోషంగా జరుపుకొంటారు. సోమవారం రంజాన్ జరుపుకొనేందుకు ముస్లింలందూ సిద్ధమయ్యారు. అన్ని ఏర్పాట్లను చేసుకున్నారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం, సింగంపల్లి, రంగంపేట, జి.మామిడాడ, పెదపూడి, పలు మసీదుల్లో సోమవారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక నమాజులు చేస్తారు. అనంతరం పేదలకు దానాలు చేస్తారు.

నవ వసంతరాత్రుల ప్రారంభం

బిక్కవోలు: పందలపాక రెడ్డ రామాలయం వద్ద కొదండ రాముడు స్వామికి నవ వసంతరాత్రులు కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు కింజరపు శ్రీరామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గొలుగూరి వెంకటరామారెడ్డి, పార్వతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామి గణపతి పూజ, స్వామివారి ప్రత్యేక పూజలు, లక్ష తులసి పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారి అలంకరించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సీతానగరం: చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చయ్యపాలెం శివారున పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఈ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. అచ్చయ్యపాలెంలో పేకాటాడుతున్న ఏడుగురు సీతానగరానికి చెందిన వారేనని, రూ 3,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం



బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభిస్తున్న సురేష్‌రెడ్డి

బిక్కవోలు: ఊలపల్లి వెలంపేట కమ్యూనిటీ హాలు వద్ద మూడు బ్యాడ్మింటన్ కోర్టులను బిక్కవోలు మాజీ పీహెచ్‌సీ చైర్మన్ తొండాపు సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు క్రీడారంగా పై దృష్టి పెట్టడం వలన మానసిక ఉల్లాసంగా ఉండడమే కాకుండా ఆటల్లో రాణించి ఉన్నత స్థాయి చేరుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు బండారు శివ, రొంగల శ్రీను,ప్రసాద్, రాంబాబు, వీరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గతుకుల మయం

- రాళ్లు పైకిలేచి అధ్వానంగా ఉన్న రహదారులు
- ఐదేళ్లలో రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్లు మంజూరు
- మధ్యలో నిలిచిన కొన్న పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రాజానగరం: ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా అభివృద్ధి మాత్రం ఆగకూడదు అనేది ప్రజాస్వామ్యంలో ప్రధాన సూత్రం. అయితే రాజానగరం నియోజకవర్గంలో మాత్రం పాలకులు ఆ విషయాన్ని మరిచారో ఏమోగానీ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పరిస్థితులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా ప్రజా జీవన గమనంలో ప్రధాన భూమికను పోషించేది రహదారులు. అయితే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రోడ్ల పైనే దృష్టిని సారిస్తున్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నా గానీ నియోజకవర్గంలో మాత్రం ఆ ఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టి, ఎన్నికల కారణంగా అసంపూర్తిగా మిగిలిన కొన్ని రోడ్ల పనులే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. సంక్రాంతి పండగ నాటికి రోడ్లకు మరమ్మతులు చేపట్టి, ప్రయాణికులకు గతుకుల బెడద లేకుండా చేస్తామని గొప్పగా చెప్పిన పాలకులు ఈ నియోజకవర్గంలో మాత్రం చేతల్లో కనిపించలేదు. గోతులు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉండగా, గోతులతోపాటు బాగున్న రోడ్డును కూడా తవ్వేసి గోతులు కనిపించకుండా కంకర రాళ్లు వేయడంతో ప్రయాణీకులు రాకపోకలకు హడలిపోతున్నారు. ఇందుకు తోకాడ నుంచి పేరారామచంద్రపురం వెళ్లే రోడ్డును ఉదాహరణగా చూడవచ్చు.

రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్లు

గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధిక ప్రాధాన్యతనిచ్చారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్ల నిధులు తీసుకువచ్చారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కాగా, మరి కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక కారణాలతోపాటు సార్వత్రిక ఎన్నికల నగరా మోగడంతో పనులు పూర్తి కాలేదు. అలా అసంపూర్తిగా మిగిలిన పనులను ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వారు పూర్తి చేయాల్సిన బాధ్యత ఉంది. కానీ ఇక్కడ అటువంటి ప్రయత్నాలు లేక ఆయా రోడ్లపై ప్రయాణించేవారు అసహనాన్ని వ్యక్త పరుస్తున్నారు.

ఈ రోడ్ల పనులు పూర్తయ్యేనా?

నియోజకవర్గంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 1773 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, వాటిలో రోడ్లను అభివృద్ధికి రూ.185 కోట్ల పైబడి నిధులు కేటాయించారు. అయితే వీటి పనులు పూర్తయ్యే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కొన్నిచోట్ల రోడ్ల అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలినిపోయాయి. మేజర్ ప్రాజెక్టుగా పేరొందిన రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డును నాలుగు లేన్లగా అభివృద్ధి చేస్తూ, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. వీటి పనులు చాలా వరకు పూర్తి కాగా రఘుదేవపురం – సీతానగరం వరకు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అలాగే మధ్యలో నాలుగు చోట్ల కల్వర్టులు పూర్తి చేయాలి. రాజానగరం జంక్షన్ నుంచి కలచవర్ల, సీతానగరం మీదుగా గాదరాడకు రెండు లేన్ల రహదారి విస్తరణ పనులు గ్రావల్ వర్క్స్ వరకు పూర్తయ్యాయి. తారు మిక్సింగ్ వేసే ప్రక్రియ జరగాల్సి ఉంది. ఈ పనులు జరగకపోవడంతో ప్రసుత్తం ఆ రోడ్డు పై వేసిన గ్రావిల్ లేచి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు పోలవరం కాలువ గట్టుపై వేసిన మట్టి గుట్టలను కొంతమంది అక్రమార్కులు తవ్వేసి, లారీలపై ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుండడంతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. వీటితోపాటు తోకాడ – పీఆర్పీపురం, ముగ్గళ్ల – కోరుకొండ, కోరుకొండ – నాగంపల్లి, పల్లకడియం – రాధేయపాలెం, దివాన్‌చెరువు – నరేంద్రపురం, పల్లకడియం – వడిశలేరు, రాఘవపురం – గరగశంపాలెం, బుచ్చింపేట – తొర్రేడు రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కావలసి ఉంది.



తోకాడ - పీఆర్పీపురం రోడ్డు పై చెల్లా చెదురుగా ఉన్న కంకర రాళ్లు



రాజానగరం - కలవచర్ల రోడ్డులో లేచిన కంకర రాళ్లు

పది శాతం పూర్తి చేయక..



రాజానగరం నుంచి కలవచర్ల, సీతారామపురం, గాదరాడకు రోడ్డు విస్తరణ పనులు 90 శాతం వరకు గత ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. ఎన్నికల కారణంగా మిగిలిన పనులు నిలిచిపోయాయి. అయితే తరువాత వచ్చిన పాలకులు ఆ 10 శాతం పనులను పట్టించుకోకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయవలసిన బాధ్యత పాలకులపై ఉంది. వాటిని పట్టించుకోవడంలేదు.

– అదబాల చినబాబు, సీతారామపురం

రోడ్లను తవ్వేసి..



తోకాడ-అనపర్తి రోడ్డుపై కంకర రాళ్లు లేచిపోయి, ప్రయాణం ఇబ్బంది అవుతుంది గతంలో పడిన గోతులను పూడ్చకుండా బాగున్న రోడ్డుతోపాటు గోతులను కూడా తవ్వేసి వదిలేశారు. దీనితో కంకర రాళ్లు పైకి లేచి, ఈ పరిస్థితి వచ్చింది. గోతులకు ప్యాచ్చీ వర్కు చేసి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు.

– అనదాస సాయిరామ్, ముక్కినాడ

ముక్తేశ్వరస్వామికి వెండి మకర తోరణం సమర్పణ



సంపర ముక్తేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడికి వెండి మకర తోరణం అందజేస్తున్న వీరవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు



ప్రత్యేకాలంకరణలో ఉన్న సూర్యనారాయణమూర్తి

పెదపూడి: ఆలయాల అభివృద్ధికి దాతలు, భక్తులు సహకారం అవసరమని దాత ప్రవాస భారతీయుడు యరంశెట్టి వీరవెంకటసత్యనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంపర గ్రామం శివారు ముక్తేశ్వరంలో ప్రసిద్ధి చెందిన బాల త్రిపుర సుందరీ సమేత ముక్తేశ్వరస్వామి వారికి యరంశెట్టి బుషాల కొడుకు యరంశెట్టి వీరవెంకట సత్యనారాయణ(యూఎస్ఏ)కోడలు శిరీష దంపతులు సుమారు రూ.1.50 వేల విలువ గల వెండి మకర తోరణం ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకుడికి సమర్పించారు. ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు డేగల విజయదుర్గ, ఈశ్వర్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెండి కవచ ఆభరణాల సమర్పణ

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి స్థానిక దాతలు నల్లమిల్లి సత్తిరెడ్డి(చైతన్య) కుటుంబ సభ్యులు సుమారు 10 కేజీలల వెండితో తయారు చేసిన కవచ ఆభరణాల బహూకరించారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు మాట్లాడుతూ దాతలు ఆలయంలో వెండి కవచ ఆభరణాలు అందజేశారన్నారు. ఉగాది విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఉదయం తెల్లవారుజామున మూడు గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి, ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించామన్నారు. లయన్స్‌క్లబ్, ఫ్యామిలీ హెల్త్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి(చింతపండు) ఉగాది సందర్భంగా బ్రాహ్మణులకు పంచాంగం అందించి దుశ్శాలువతో పండితులను సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, విజయచార్యులు, రాంబాబు ఆచార్యులు, పరుషోత్తమాచార్యులు ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పెదపూడి: గ్రామంలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అరుమిల్లి అమ్మన్న చౌదరి అన్నారు. గ్రామంలో ఆదివారం దాత పుట్టా వీరవెంకట సత్యనారాయణ పెదనాన్న, పెద్దమ్మ దివంగత ఆరుమిల్లి సూర్యనారాయణ, సీతమ్మ జ్ఞాపకార్థం రూ.2,01,116 విరాళం నిర్మాణ అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు అందజేశారు. గ్రామానికి చెందిన కోరా లక్ష్మీనారాయణ, సుబ్బయమ్మ జ్ఞాపకార్థం అల్లుడు నూని వీరవెంకట సత్యనారాయణ రూ.1,25,000 అందజేశారు. కార్యక్రమంలో నిర్మాణ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మార్ని అన్నవరం, నిమ్మలపూడి గోపి, మార్ని కాశీ, ఆరుమిల్లి వాసు, అబ్బిన సూరిబాబు, కంచు గంగాధర్, బిక్కిన అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న పుట్టా వీరవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

గ్రామ పరిశుభ్రతకు నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికుల సేవలు కొనియాడదగినవని పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి అన్నారు. పెదపూడి గ్రామ పంచాయతీలో 20 మంది పారిశుధ్య కార్మికులకు విశ్వావసు నామ ఉగాది సంవత్సరం సందర్భంగా ఆదివారం గ్రామ పంచాయతీ పాలకవర్గం దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, సచివాలయం కార్యదర్శి ఉషారాణి పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి



రంగంపేటలో పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న దైవజనులు



కోరుకొండలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రంగంపేట: రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పలు అనుమానాలకు తావిస్తుందని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని పాస్టర్లు కేఆర్ ఆనంద్ విక్టర్, చింతపల్లి వినయ్‌కుమార్, రాయి చార్లెస్ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎలీమ్ లూథరన్ చర్చి వద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై క్రైస్తవులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబాసి వర ప్రసాద్, కరుపోతు మంగరాజు, గుండుబిల్లి దైవ ప్రసాద్, గుడాల కాంతరత్నం, సంఘ సభ్యులు, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు, సండే స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుకొండలో క్రైస్తవుల శాంతి ర్యాలీ

మధురపూడి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి న్యాయం కోరుతూ ఆదివారం కోరుకొండలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయంత్రం శాంతి యుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌సెంటర్‌లో మృతుడు పాస్టర్ ప్రవీణ చిత్రపటానికి పూలమాలలు వేసి క్రొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. అనంతరం బస్టాండ్‌సెంటర్‌లో మానవహారం చేశారు. రెవరెండ్ రెవరెండ్ పాస్టర్లు కృపావిల్సన్, ఎం.లాజరస్, మోహన్‌రాయుడు, ఒరిగేటి ప్రసన్నకుమార్, చిర్రా ప్రసాద్, పరంజ్యోతి, ప్రజా ప్రతినిధులు నక్కా రాంబాబు, గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోగులమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

- గ్రామ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి
- వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సూర్యనారాయణరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: గ్రామ దేవతల ఉత్సవాలను భక్తులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉత్సాహంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎస్‌పురంలో పాటిమీద కొలువై ఉన్న గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా అమ్మవారి జాతర ఉత్సవం కనుల పండుగగా నిర్వహించడం చాలా అభినందనీయమని ఆలయ కమిటీ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయం వద్ద సుమారు 8 వేల మందికి నిర్వహించిన అన్నదానంలో మాజీ ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. కోటి గాజులతో అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకరణ అందర్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి మండలం కుతుకులూరు గ్రామం బసివిరెడ్డి పేటలో వెలసిన అచ్చియమ్మ పేరంటాలమ్మను వైఎస్సార్‌సీపీ అనపర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయం వద్ద సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

మావుళ్లమ్మకు 108 వంటకాలతో సారె సమర్పణ



సీతానగరం మావుళ్లమ్మ అమ్మవారి సారెను ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: గ్రామ దేవత మావుల్లమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు చేశారు. 108 రకాల వంటకాలతో సారెను సమర్పించారు. స్థానిక మహిళలు సుమారు 900 మంది అమ్మవారికి సారెను సమర్పించారు. 108 రకాల వంటలను 900 బిందెలలో ఉంచారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా బిందెలు ధరించిన మహిళలు లంకూరు, నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా పాత పోలీస్ స్టేషన్, వెలమపేట, పోలీస్ స్టేషన్ నుంచి అమ్మవారి ఆలయంకు చేరుకుని అమ్మవారికి 108 వంటకాల సారెను సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు అమ్మవార్ల తీర్థం

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో గ్రామదేవత కాళీ దుర్గాంబిక అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. సోమవారం తీర్థ మహోత్సవం జరగనుంది. అలాగే చక్రద్వారబంధంలోను గ్రామదేవత సోమాలమ్మ వారి జాతర ఆదివారం నిర్వహించారు. ఇక్కడ కూడా సోమవారం తీర్థం జరుగనుంది.

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని అమ్మవారి తీర్థాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తోటలోని మహాలక్ష్మీ అమ్మవారు, దుర్గమ్మ తల్లి తీర్థాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులు అమ్మవారి నేవైద్యాలు సమర్పించుకున్నారు.

రిజిస్ట్రేషన్లు నిల్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదివారం ఒక్క రిజిస్ట్రేషన్ అవ్వలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది పర్వదినం రోజున, అలాగే సోమవారం రంజాన్ రోజున కూడా పని చేయాలని సీతానగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తెరచి ఉంచారు. ఎవరైన రిజిస్ట్రేషన్లకు వస్తారని సాయంత్రం వరకు ఎదురు చేశారు. సాయంత్రమైన ఒక్క రిజిస్ట్రేషన్ జరగలేదు. సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ సోమవారం కూడా కార్యాలయం పని చేస్తుందని తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

రంగంపేట: తెలుగు భాషా సంస్కృతిని, సాంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో కవులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విశ్వావసు ఉగాది కవి సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంగ్ల భాషా భిమానాన్ని చాటినా, తెలుగు భాషపై పట్టు సాధించే విధంగా విద్యా వంతులు, కవులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వసంతకాలం, విశ్వావసు తెలుగు సంవత్సరాది, సామాజిక అంశాలపై కవులు చన్న వెంకటేశ్వరరావు, చొల్లంగి సత్యనారాయణ, తెలుగు పండిట్ స్వాతికుమారి, ఎల్.శ్రీనివాసరాజు తమ కవితా గానాన్ని వినిపించారు. అంతకు ముందు గ్రామ పురోహితులు కోడూరి వెంకటరత్నం పంచాంగ పఠనం చేశారు. రాశి ఫలాలు తెలిపారు. పురోహితులు వెంకటరత్నంను, కవులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



కవితా గానం చేస్తున్న కవి చొల్లంగి సత్యనారాయణ

ఉత్సాహంగా ఉగాది వేడుకలు



బలభద్రపురంలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు

బిక్కవోలు: మండల గ్రామాల్లో ఉగాది వేడుకలను ఆదివారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. విశ్వావసు నామ సంవత్సరాదికి ఘనంగా స్వాగతం పలికారు. ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఉగాది పండగను ఆనందంగా జరుపుకున్నారు. వేప పువ్వు, బెల్లం, చింత పండు, తదితర షఢ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని ఆరగించారు. చిన్నారులు, మహిళలు, యువకులు పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆయా గ్రామాలలోని ప్రముఖ ఆలయాలను దర్శించుకున్నారు. గ్రామాలలో పండితులు పంచాంగశ్రవణం గావించారు. భక్తులంతా భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బిక్కవోలు ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గోలింగేశ్వర స్వామి వారి అలయంలోను కొంకుదురు బుడతలమామిడి త్రిముఖలింగేశ్వరుని ఆలయం, పందలపాక శ్రీగౌరిశంకర, కాశీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వర ఆలయంలోనూ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఊలపల్లి, బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెంలోను ప్రముఖ ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సీతానగరంలోని సీతారామాలయం, ఉమా రామలింగేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభావ సమేత వేణుగోపాల స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉత్తమ సేవలకు ఉగాది పురస్కారం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన డాక్టర్ సత్యం రమేష్‌బాబు అందించిన ఉత్తమ వైద్య సేవలకు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఉగాది సందర్భంగా అన్ని రంగాల వారికి ఉగాది పురస్కారాలు అందించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ రమేష్‌బాబుకు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చియ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి సమక్షంలో ఎంపీ పురందేశ్వరి ఘనంగా సన్మానించి, ఉగాది పురస్కార్‌ను అందించారు.



ఎంపీ పురందేశ్వరి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ రమేష్‌బాబు